క్లుప్తంగా

కేయూలో ఇద్దరికి డాక్టరేట్


సుమలత


యాకయ్య

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరు పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. పర్ఫార్మన్స్ అప్రైసల్ ఇన్ కోల్ ఇండస్ట్రీ – ఏ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల పరిశోధకురాలు సంగాల సుమలతకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కే.సాయిలు పర్యవేక్షణలో సుమలత తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే, స్టడీ ఆన్ ది కో ఎఫీసియెంట్ ఇన్‌క్వాలిటీస్ ఫర్ సమ్ సబ్‌క్లాసెస్ ఆఫ్ అనాలటిక్ ఫంక్షన్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గణిత విభాగం పరిశోధకుడు కే.యాకయ్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు మల్లారెడ్డి పేర్కొన్నారు. ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.భారవి శర్మ పర్యవేక్షణలో యాకయ్య తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

భక్తితో జ్ఞానాన్ని ఆర్జించాలి



రామన్నపేట: విద్యార్థులు భక్తిని పెంపొందించుకొని జ్ఞానాన్ని ఆర్జించాలని శ్రీమాన్ సముద్రాల శఠకోపాచార్య అన్నారు. నగరంలోని ఏవీవీ కళాశాలలో సోమవారం నిర్వహించిన పోతన జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. భాగవత కథ ప్రారంభ ముఖ్య ఘట్టాలని విద్యార్థులకు వివరించారు. అనంతరం, కళాశాల ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి మాట్లాడుతూ 60ఏళ్ల నుంచి విద్యార్థులకు భాగవత పద్య పఠన పోటీలు నిర్వహిస్తూ బాల్యం నుంచే పిల్లల్లో ఆధ్యాత్మిక స్పృహను కలిగిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పద్యపఠన పోటీల విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎల్ఎన్ ప్రసాద్, డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఏవీవీ విద్యాసంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ చందా విజయకుమార్, శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

10న 'మోషన్' టాలెంట్ టెస్ట్

హన్మకొండ: నయీంనగర్‌లోని మోషన్ కళాశాలలో ఈనెల 10న టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. ఈమేరకు కళాశాలలో టాలెంట్ టెస్ట్ బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోషన్ టాలెంట్ టెస్ట్‌ను ఈనెల 10న ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కళాశాలలో నిర్వహించనున్నట్లు వివరించారు. టెస్ట్‌లో మెరిట్ సాధించిన మొదటి ముగ్గురు ర్యాంకర్లకు రూ.10 లక్షల విలువ గల ఉచిత హాస్టల్‌తో కూడిన కోచింగ్, మొదటి 3ర్యాంకర్లకు ట్యాబ్‌లు, తర్వాత మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ.6 లక్షల విలువ గల ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షకు హాజరైన ప్రతీ విద్యార్థికి కళాశాల ఫీజులో 20శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మోషన్ టాలెంట్ టెస్ట్ రాయాలనుకునే విద్యార్థులు ఈనెల 9వ తేదీ సాయంత్రంలోపు 97030 00850, 97030 00851, 97030 00852 నంబర్లలో లేదా నయీంనగర్‌లోని మోషన్ కళాశాలను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

మాలధారులకు అన్నదానం



కాశిబుగ్గ: కాశిబుగ్గ ఓ సిటీరోడ్డులోని సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో భక్తులకు సోమవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, కాంగ్రెస్ నాయకులు కూచన రవీందర్, వీరన్న, శ్రీనివాస్, ఆలయ అర్చకుడు శ్రీకాంతాచారి, మాలధారులు పాల్గొన్నారు.

కార్తీకమాస ప్రత్యేక పూజలు


కాశీ విశ్వేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు


కాజీపేట శ్వేతార్క ఆలయంలో భక్తులు


ఖిలా వరంగల్: వ్రతం చేస్తున్న మహిళలు

కాశిబుగ్గ: కార్తీకమాసం సోమవారాన్ని పురస్కరించుకుని కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున కాశీ విశ్వేశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించారు. భక్తులు 9కిలోల నెయ్యి, తేనెతో ఆలయంలోని సహస్ర లింగానికి భక్తిశ్రద్ధలతో అభిషేకం చేశారు. పూజా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, వెంకన్న, నాగరాజు, రవికుమార్, శ్రీనివాస్, పోశాలు పాల్గొన్నారు.

శ్వేతార్క ఆలయంలో..

కాజీపేట: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో పండితులు సప్తనది జలాలతో స్వామి వారికి సోమవారం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తెచ్చిన నదీజలాల సహస్ర ధారలతో అభిషేకాలు జరిపించారు. హైదరాబాద్‌కు చెందిన పలువురు భక్తులు శ్వేతార్క ఆలయాన్ని సందర్శించి ఆలయ ఆవరణలోని 29 దేవతామూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ విశిష్టత, నిత్యపూజల వివరాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు శర్మ భక్తులకు వివరించారు. వివిధ ప్రాంతాల నుంచి శ్వేతార్కుడి దర్శనం కోసం ప్రత్యేక వాహనాల్లో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. అన్నపూర్ణ భవన్‌లో భక్తులందరికి మహాన్నదానం చేశారు.

శాస్త్రోక్తంగా అనఘాష్టమి వ్రతం

ఖిలా వరంగల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయం ప్రాంగణంలో సోమవారం అనఘాష్టమి వ్రతం నేతపర్వంగా జరిగింది. ఆలయ ప్రధాన పూజారి శివరామకృష్ణ చార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వ్రతాన్ని నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పూజా సామాగ్రితో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో వ్రతం పూజలు చేశారు. కార్యక్రమంలో మంచాల కృష్ణమూర్తి, శ్రీరాం రాజేష్, రావికంటి అశోక్, ఆడెపు శ్యాంసుందర్, యాదగిరి, శైలజ, రావికంటి శ్రీదేవి, మంచాల రాణి, కృష్ణవేణి, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

మూడు రాష్ట్రాల్లో బీజేపీ విజయభేరి


మాట్లాడుతున్న వన్నాల వెంకటరమణ

వరంగల్: మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధించడం.. 2024లో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్రమోదీ నేతృత్వంలో ఏర్పడే ప్రభుత్వానికి దిక్సూచి అని పార్టీ తూర్పు నేత డాక్టర్ వన్నాల వెంకటరమణ అన్నారు. ఎల్‌బీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్ద రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో డబుల్ డిజిట్‌కే పరిమితమైన కాంగ్రెస్ నేతృత్వంలో ఏర్పడిన ఇండియా కూటమికి చిల్లు పడిందని ఆరోపించారు. తూర్పు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావును గెలిపించేందుకు పార్టీ శ్రేణులు అహర్నిశలు కష్టపడి పనిచేసినా ఓటమి చెందడం విచారకరమన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముంద్రాతి వెంకటేశ్వర్లు, నాయకులు మాదాసి రాజు, అపురూప రజనీష్‌నేత, జున్ను సుబ్రహ్మణ్యం, క్యాతం రాజ్‌కుమార్, చంద్రమౌళి, వంగ సంపత్, దేవేందర్, సంగీత్, వంగరి ప్రదీప్, జగన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


ర్యాలీలో పాల్గొన్న ఏసీపీ, సీఐ, విద్యార్థులు

ఖిలా వరంగల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు సూచించారు. స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా వరంగల్ ఫోర్ట్‌రోడ్డు శంభునిపేటలో రెనాల్డ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెల్మెట్ వాడకంపై సోమవారం అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా బైక్‌పై వెళ్లే వారికి గులాబీ పువ్వు అందజేసి హెల్మెట్ ఆవశ్యకతను తెలియజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం వల్ల అనేక మంది వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, శ్రీవిద్య, రాజేశ్వర్‌రెడ్డి, రాంకీ, మహేష్, శ్రీహరి, వెంకటేష్, సతీష్, ప్రవీణ్, రాజు, ప్రసాద్, సురేష్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

'మల్లికాంబ'లో ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

హన్మకొండ అర్బన్: అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రతిమ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, డైరెక్టర్ డాక్టర్ అవినాష్ తిప్పని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మల్లికాంబలోని దివ్యాంగ చిన్నారులకు సేవ చేస్తున్న సిబ్బంది ఓదెమ్మకు క్యాన్సర్ వస్తే ప్రతిమ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉచిత సర్జరీ చేసి, మందులు అందించినట్లు గుర్తు చేశారు. ప్రతిమ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. మల్లికాంబ కేంద్రానికి కూడా తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని అన్నారు. అవసరమైన చిన్నారులకు ఉచిత వైద్య సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనంతరం దివ్యాంగులైన చిన్నారులకు ఉచిత గైనకాలజీ, గ్యాస్ట్రిక్, దంత, చర్మ సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు అవినాష్, సుమిత్ర, రమేష్, ప్రియాంక, మల్లికాంబ నిర్వాహకురాలు బండా రామలీల, పద్మ, కోడం కల్యాణ్, సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ


వరంగల్ జిల్లా జట్టు క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు


జిల్లా క్రికెట్ జట్టుతో ఎస్‌జీఎఫ్, అసోసియేషన్ బాధ్యులు

హన్మకొండ: ఈనెల 4నుంచి 6వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా బూసాపూర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో పాల్గొనే వరంగల్ క్రీడా జట్టుకు టీషర్టులను పంపిణీ చేశారు. హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో సోమవారం జరిగిన పంపిణీ కార్యక్రమంలో కబడ్డీ సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి ఎండీ.అబ్దుల్లాఖాన్, ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, జాయింట్ సెక్రటరీ మల్లికార్జున్, కోచ్ నారాయణ, బాధ్యులు అస్లాంఖాన్, వినయ్ కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఈనెల 5నుంచి 8వ తేదీ వరకు గద్వాలలో జరగనున్న ఎస్‌జీఎఫ్ అండర్ -17 బాలుర క్రికెట్ జిల్లా జట్టు క్రీడాకారులకు వరంగల్ క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి ఉదయభానురావు టీషర్టులను పంపిణీ చేశారు. హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, కుమార్, కోదండపాణి, ప్రభాకర్, శంకర్, రఘు, సుమన్, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

కేబినెట్‌లో 'నాయిని'కి చోటు కల్పించాలి


మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్లు

హన్మకొండ: వరంగల్ పశ్చిమ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన నాయిని రాజేందర్‌రెడ్డికి నూతన ప్రభుత్వంలోని కేబినెట్‌లో సముచిత స్థానం కల్పించాలని జీడబ్ల్యూఎంసీ పార్టీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు కోరారు. హనుమకొండలోని అశోకా హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముప్పై సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రజల సమస్యలపై నాయిని పోరాటం చేస్తున్నారని గుర్తుచేశారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ నాయకుడు తోట పవన్, సైండ్ల శ్రీకాంత్, కుమార్‌యాదవ్, గాండ్ల స్రవంతి, భాస్కర్‌రెడ్డి, పల్లం శ్రీకాంత్, లక్ష్మణ్‌రెడ్డి, వెంకటరమణ, ఖాజా అహ్మద్, మంద సుమన్, చందు తదితరులు పాల్గొన్నారు.

నాగరాజు గెలుపొందడంతో మొక్కు చెల్లింపు


మొక్కులు చెల్లిస్తున్న కార్యకర్తలు

మడికొండ: వర్ధన్నపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు గెలుపొందడంతో పోతరాజు విగ్రహం వద్ద పార్టీ కార్యకర్తలు సోమవారం మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో గత ఎమ్మెల్యే అరూరి రమేష్ విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో బిల్ల రవీందర్, బైరి లింగమూర్తి, వస్కుల భాస్కర్, శంకర్, నాగరాజు, శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా నిర్ణయాన్ని గౌరవిస్తున్నా..

ఖిలా వరంగల్: శాసనసభ ఎన్నికల్లో ప్రజా నిర్ణయాన్ని గౌరవిస్తున్నానని తాజా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. వరంగల్ శాంతినగర్‌లోని రాజశ్రీగార్డెన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష హోదాలో ప్రజల పక్షాన నిలబడి సమస్యలపై పోరాడుతానని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేసిన ప్రజలు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని అన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు చింతాకుల అనిల్, మరుపల్లి రవి, దిడ్డి కుమారస్వామి, సోమిశెట్టి ప్రవీణ్, నాయకులు రాజనాల శ్రీహరి, రమేష్, సత్యనారాయణ, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయంపై నిరుద్యోగుల హర్షం


స్వీట్ తినిపిస్తున్న అజీజ్‌ఖాన్

హన్మకొండ: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. హనుమకొండలోని జిల్లా గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు సోమవారం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాయల సంస్థ చైర్మన్ ఎండీ.అజీజ్‌ఖాన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన భర్తీ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రంజిత్, ధర్మయ్య, అనిల్, కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయాన్ని స్వాగతించిన ఎంప్లాయీస్ యూనియన్

తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని స్వాగతిస్తున్నట్లు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న తెలిపారు. పదేళ్లుగా ఆర్టీసీ కార్మికుల గోసను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికులను సర్కారు హింసించిందని, వందలాది కార్మికుల చావుకు కారణమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. మొదటి కేబినెట్ సమావేశంలో ఆర్టీసీ సమస్యలపై చర్చించాలని కోరారు.

అంబేడ్కర్ భవన్ పేరును స్వాగతిస్తున్నాం


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్లు, తదితరులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని ప్రగతిభవన్‌ను డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ప్రజాభవన్‌గా నామకరణం చేస్తున్నట్లుగా కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తూ కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ నర్సింహారెడ్డి, డాక్టర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లోని దూరవిద్యా కేంద్రం ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం అంబేడ్కర్ ఆశయ సాధన కోసం పనిచేయాలని సూచించారు. భారత రాజ్యాంగాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించి, నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పరిశోధక విద్యార్థి కల్లెపెల్లి ప్రశాంత్, విద్యార్థి సంఘం నాయకులు చెల్పూరి శ్రీకాంత్, అరవింద్, నిఖిల్, పవన్‌రామ్, ప్రేతాప్, అంజలి, సాయిప్రియ, సుప్రజ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

కొండా సురేఖ గెలుపుతో సంబురాలు


దయానంద కాలనీలో నాయకుల సంబురాలు


స్వీట్లు పంపిణీ చేస్తున్న సారయ్య, యూసుబ్

వరంగల్ చౌరస్తా: వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా కొండా సురేఖ విజయం సాధించడంపై కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. వరంగల్ 27వ డివిజన్‌లోని అబ్బనికుంట, యాకుబ్‌పురా, దయానంద కాలనీ, గోవింద రాజులగుట్ట, గిర్మాజీపేట, పాత కూరగాయల మార్కెట్, స్టేషన్‌రోడ్డు, కృష్ణ కాలనీల్లో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ ఆధ్వర్యంలో సోమవారం బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు భాషపాక సదానందం, మంద శ్రీనివాస్, సందెల లాజర్, గుల్లపల్లి రామకృష్ణ, జస్విన్ సింగ్, కొండమీద సదానందం, జంగం ప్రభాకర్, ఎర్రం కమల్, పోలెపాక విశాల్‌బాబు, కట్కూరి అన్వేష్, మహిళా నాయకులు గూడ శారద, జహీరా, ఇనుముల విజయ, స్వరూప, రజియా పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ

వరంగల్ చౌరస్తా: వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా కొండా సురేఖ విజయకేతనం ఎగురవేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ వరంగల్ 28వ డివిజన్ విశ్వకర్మ వీధిలో కాంగ్రెస్ నాయకులు సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. చిట్టిమళ్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మర్రి రవీందర్, సంపత్, శోభన్, సత్యం, వేణు, రవి, రామ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సురేఖకు మంత్రి పదవి ఇవ్వాలి

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించిన కొండా సురేఖకు మంత్రి పదవి ఇవ్వాలని ఓరుగల్లు లోకల్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి యూసుబ్ కోరారు. సురేఖ గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తూ వరంగల్ లారీ డ్రైవర్లు, హమాలీలకు సోమవారం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ కక్కె సారయ్య మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం పాటుపడే సురేఖ మంత్రి పదవికి అర్హులరాలని సూచించారు. కార్యక్రమంలో నారాయణ, పోలెపాక కన్న, జన్ను ప్రసాద్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

నియంతృత్వ విధానాలతో బీఆర్‌ఎస్ ఓటమి


సమావేశంలో మాట్లాడుతున్న ఆరెల్లి కృష్ణ

ఖిలా వరంగల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత పదేళ్లుగా నియంతృత్వ, అప్రజాస్వామిక విధానాలతోనే ఓటమి పాలయిందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నేత ఆరెల్లి కృష్ణ విమర్శించారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఏకశిలనగర్‌లో బాలరాజు అధ్యక్షతన సోమవారం జరిగిన ఎన్నికల సమీక్ష సమావేశంలో కృష్ణ మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడిందని అన్నారు. అనంతరం, మానవ హక్కుల వేదిక జిల్లా నేత బండి కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలగకుండా కొత్త ప్రభుత్వం చూడాలని, ప్రజాసంఘాల నాయకులపై ఉన్న అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఎర్ర జయబాబు, సాంబయ్య, హరిబాబు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇటు నోటు.. అటు ఓటు

- భారీగా క్రాస్ ఓటింగ్
- బీఆర్‌ఎస్ కొంపముంచిన గల్లీ లీడర్లు
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల్లో కోవర్టులు

హసన్‌పర్తి: వర్ధన్నపేట ఓటర్లు విచిత్రమైన తీర్పు ఇచ్చారు. ఓటు కోసం ఇచ్చిన డబ్బులకు ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇటు నోటు తీసుకుని ఇంకో పార్టీ అభ్యర్థికి ఓటు వేసినట్లుగా ఎన్నికల ఫలితాల సరళిని చూస్తే తెలుస్తోంది. బీఆర్‌ఎస్ నియోజకవర్గ అభ్యర్థి తాజా మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బరిలో నిలవగా, కాంగ్రెస్ నుంచి రిటైర్డ్ పోలీస్ అధికారి కేఆర్.నాగరాజు పోటీచేశారు. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ నిలబడ్డారు. అయితే ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య పోటీ సాగింది.

క్రాస్ ఓటింగ్‌తో నష్టం

ఇక్కడ భారీగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. ముందుగా ఓటర్లకు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి డబ్బులు ముట్టినట్లు సమాచారం, అయితే, చివరి క్షణంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి.. ఓటర్లకు డబ్బులు పంచలేదని ప్రచారం జరిగింది. ఓటర్లు మాత్రం బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన డబ్బులు తీసుకుని కాంగ్రెస్‌కు ఓటు వేసినట్లుగా స్థానికంగా చర్చ జరుగుతోంది. పర్వతగిరి, ఐనవోలు, హసన్‌పర్తి మండలాల్లో క్రాస్ ఓటింగ్ జరిగినట్లు ఫలితాల బట్టి తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ తాయిలాలు ఇవ్వనప్పటికీ ఆ పార్టీకే ప్రజలు ఓట్లేశారు.

డబ్బులు నొక్కేసిన నాయకులు

హసన్‌పర్తి మండలంలోని గల్లీలీడర్లు బీఆర్‌ఎస్ కొంపముంచినట్లుగా స్థానికంగా విమర్శలొస్తున్నాయి. ఓటర్లకు పంచేందుకు వచ్చిన నగదులో కొంతమొత్తాన్ని నొక్కి మిగతాది పంపిణీ చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. కొన్ని గ్రామాల్లో ఓటర్లకు ఏమీ పంచకుడా అన్ని డబ్బులు కాజేసినట్లుగా స్థానికులు చెబుతున్నారు.

ఇరు పార్టీల్లో కోవర్టులు

ఇటు బీఆర్‌ఎస్, అటు కాంగ్రెస్ పార్టీలు కోవర్టు వ్యవస్థను ప్రోత్సహించినట్లుగా తెలిసింది. వివిధ గ్రామాల్లో ఆయా పార్టీలకు సంబంధించిన ప్రధాన నాయకులకు ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులు డబ్బులు ఇచ్చినట్లుగా తెలిసింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకతతో పాటు ఆయా గ్రామాల్లో నాయకుల వ్యవహార శైలి వల్ల అధికార పార్టీ అభ్యర్థికి నష్టం జరిగిందని, కాంగ్రెస్‌కు లాభించిందని స్థానికులు విశ్లేషించుకుంటున్నారు.

బీఆర్‌ఎస్ కంచుకోటకు బీటలు

- ఆవిర్భావం నుంచి ప్రతీసారి గులాబీ రెపరెపలు
- ఇప్పుడు బీఆర్‌ఎస్‌ను కాదని కాంగ్రెస్‌కు పట్టం కట్టిన ఓటర్లు

హన్మకొండ: బీఆర్‌ఎస్ కంచుకోట బీటలు వారింది. మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ పార్టీగా ఆవిర్భవించిన టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్) వరంగల్ పశ్చిమ ఎన్నికల్లో ప్రతీసారి విజయం సాధిస్తూ కంచుకోటగా మలచుకుంది. 2023 శాసనసభ ఎన్నికల నాటికి పటిష్టంగా ఉన్నట్లు కనిపించినా ఫలితాల నాటికి చతికిల పడింది. పార్టీ ఆవిర్భావం నుంచి ఏ ఎన్నికల్లోనూ పట్టుసడలని బీఆర్‌ఎస్ కంచుకోట.. ఈ ఎన్నికల్లో బీటలు వారింది. కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డికి 72,649 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్ దాస్యం వినయ్‌భాస్కర్‌కు 57,318 ఓట్లు పోలయ్యాయి. రాజేందర్ రెడ్డి 15,331 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2001లో టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్) ఆవిర్భావం తర్వాత మొదటిసారి 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభకు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్, టీఆర్‌ఎస్ కలిసి పోటీ చేశాయి. అప్పటి హనుమకొండ నియోజకవర్గం నుంచి టీఆర్‌ఎస్ అభ్యర్థి మందాడి సత్యనారాయణ రెడ్డి విజయం సాధించారు. 2009 నియోజకవర్గాల పునర్విభజనతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఏర్పడింది, అప్పటి నుంచి 2018వరకు జరిగిన ప్రతీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ విజయం సాధించి వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని కంచుకోటగా మలచుకుంది. 2023లో జరిగిన ఎన్నికల్లో కంచుకోట బీటలు వారింది. 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 స్థానాల్లో 4 స్థానాల్లో టీడీపీ విజయం సాధించగా, 7 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచింది. ఒక్క వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోనే బీఆర్‌ఎస్ (దాస్యం వినయ్‌భాస్కర్) విజయం సాధించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మిగతా నియోజకవర్గాల్లో పార్టీల విజయం మారినా పశ్చిమ నియోజకవర్గంలో మాత్రం పట్టు నిలుపుకుంటూ వచ్చింది. ఇలాంటి నియోజకర్గంలో మంచి రేసులో ఉన్న కారు ఒక్కసారిగా బోల్తా కొట్టింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో హనుమకొండ నియోజకవర్గంలో నుంచి మందాడి సత్యనారాయణ రెడ్డి, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2009లో వరంగల్ పశ్చిమ నుంచి దాస్యం వినయ్‌భాస్కర్, 2010లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ దాస్యం వినయ్‌భాస్కర్, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2014, 2018లో జరిగిన ఎన్నికల్లోనూ దాస్యం వినయ్‌భాస్కర్ వరుస విజయాలు సాధించారు. ఈసారి గెలుపుపై ఆశలు పెంచుకున్నా ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, వినయ్‌భాస్కర్ అనుచరుల వ్యవహార శైలి, కొంత క్యాడర్ పూర్తిస్థాయిలో సహకరించకపోవడం, పలు ఆరోపణల నేపథ్యంలో ప్రజలు, యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యావేత్తలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో గులాబీ రేకులు వాడిపోయాయి. పోలింగ్ శాతం పెరిగితే కాంగ్రెస్ లాభిస్తుందని, పోలింగ్ శాతం తగ్గితే బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఉండవచ్చని అంతకుముందు ఊహాగానాలు కొనసాగాయి. అయితే పోలింగ్ శాతం తగ్గినా బీఆర్‌ఎస్ ఓటమి పాలుకావడం, బీఆర్‌ఎస్ ఓట్లు కాంగ్రెస్‌కు మళ్లడంతో పాటు, బీజేపీ ఈసారి గణనీయమైన ఓట్లు రాబట్టుకుంది. బీఆర్‌ఎస్ ఓట్లను బీజేపీ కూడా చీల్చుకోవడం కాంగ్రెస్ విజయానికి అవకాశాలు పెరిగాయి. 2010లో జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 74.85 శాతం ఓట్లు సాధించగా, కాంగ్రెస్ 17.71 శాతం ఓట్లు ఓట్లు వచ్చాయి. టీడీపీకి 4.88 ఓట్లు పోలయ్యాయి. 2014లో జరిగిన ఎన్నికల్లో 59.31 శాతం ఓట్లు సాధించగా, కాంగ్రెస్‌కు 19.31 శాతం, బీజేపీకి 13.2 శాతం ఓట్లు పోలయ్యాయి. 2018లో బీఆర్‌ఎస్ 56.78 శాతం ఓట్లు రాబట్టుకోగా, కాంగ్రెస్ పొత్తుతో పోటీ చేసిన టీడీపీకి 31.23 శాతం, బీజేపీకి 2.54 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈసారి (2023లో) జరిగిన ఎన్నికల్లో 34.29 శాతం ఓట్లు వచ్చాయి. ఇక్కడ కాంగ్రెస్‌కు 43.46 శాతం, బీజేపీకి 18.44 శాతం ఓట్లు పోలయ్యాయి. 2010 నుంచి చూసుకుంటే బీఆర్‌ఎస్ విజయం సాధిస్తూ వచ్చినా ఓట్ల శాతం తగ్గుతూ వచ్చింది. 2018లో కాంగ్రెస్ పొత్తుతో పోటీ చేసిన టీడీపీకి 31.23 శాతం ఓట్లు రాగా, ఈసారి 43.46 శాతం ఓట్లు రాబట్టుకుని విజయం సాధించింది. అయితే, బీజేపీకి 2018లో 2.54 శాతం ఓట్లు రాగా, ఈసారి 18.44 శాతం ఓట్లు పోలయ్యాయి. గతంలో పోలిస్తే బీజేపీ ఈసారి 15.90 శాతం ఓట్లు అదనంగా రాబట్టుకుంది. గతంతో పోలిస్తే కాంగ్రెస్‌కు 12.23 శాతం ఓట్లు అధికంగా వచ్చాయి. బీఆర్‌ఎస్‌కు 22.49 శాతం ఓట్లు తగ్గాయి. బీఆర్‌ఎస్‌కు తగ్గిన ఓట్లు కాంగ్రెస్, బీజేపీకి మళ్లినట్లు విశ్లేషకులు చెప్పుతున్నారు.